సాక్షి
జగిత్యాల
గురువారం । 27 । జూలై । 2023



రైతులను ప్రోత్సహించాలి

కథలాపూర్ : పండ్లతోటల పెంపకానికి రైతులను ప్రోత్సహించాలని అడిషనల్ డీఆర్డీవో శివాజీ అధికారులకు సూచించారు.



నియామకం

జగిత్యాల/కథలాపూర్: ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శిగా మేడిపెల్లి జెడ్పీ హైస్కూల్ పీడీ భూక్యా లక్ష్మీరామ్‌నాయక్‌ను నియమించారు.

గరిష్టం/కనిష్టం
28.0/24.0

వాతావరణం

ఆకాశం దట్టమైన మేఘాలతో ఆవరించి ఉంటుంది. జిల్లాలో భారీనుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అలర్ట్‌గా ఉండాలి



వరదను పరిశీలిస్తున్న ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం/సారంగాపూర్: భారీ వర్షాలతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, జిల్లాప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ భాస్కర్ అన్నారు. బీర్‌పూర్ మండలం కమ్మునూర్ గోదావరి వరద ఉధృతిని బుధవారం ఆయన పరిశీలించారు. భారీ వర్షాలతో తలెత్తే సమస్యలను అధిగమించేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని ఆదేశించారు. వర్షప్రభావం, వరద పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేయాలని అన్నారు. వరద ఉధృతిని అంచనా వేయకుండా నదులు, కాలువలు, కుంటలు, వాగులు దాటే ప్రయత్నం చేయవద్దన్నారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దన్నారు.

దయనీయ స్థితిలో గురుకుల విద్యార్థులు



ఆహార పదార్థాలు పరిశీలిస్తున్న భోగ శ్రావణి

జగిత్యాలరూరల్: గురుకుల విద్యార్థులు కనీస వసతులు లేక దయనీయస్థితిలో ఉన్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి అన్నారు. రాయికల్ మండలం అల్లీపూర్ మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలను బుధవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో మౌలిక వసతులు లేవని పేర్కొన్నారు. ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. వర్షాలతో భవనం ఉరుస్తోందని తెలిపారు. విద్యార్థులు నిద్రాహారాలు మానేసి భయంతో గడుపుతున్నారని పేర్కొన్నారు.

ఉబికి వస్తున్న నీరు



బోరు నుంచి వస్తున్న నీరు

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): గోధూర్ మార్గంలో రోడ్డు పక్కనున్న రైతు దొనికెన ముత్తన్న వ్యవసాయ భూమిలోని బోరుబావి నుంచి నీరు ఉబికి వస్తోంది. కొద్దిరోజులుగా వర్షాలు కురుస్తుండడంతో భూగర్భ జలాలు వృద్ధి చెంది నీళ్లు పైకి వస్తున్నాయి. విద్యుత్ మోటారు అవసరం లేకుండానే 24గంటలపాటు నీరు ఉబికి వస్తోందని రైతు తెలిపాడు. ప్రజలు, రైతులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

కోరుట్ల మున్సిపల్ కమిషనర్ బదిలీ!



ఎండీ అయాజ్

కోరుట్ల: కోరుట్ల మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్ బదిలీ అయినట్టు తెలిసింది. రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్‌గా ఆయనను నియమిస్తున్నట్లు సమాచారం. ఫస్ట్ గ్రేడ్ మున్సిపాలిటీ అయిన సిరిసిల్ల బల్దియా కమిషనర్‌గా ఎండీ అయాజ్ పదోన్నతి కూడా పొందినట్లు తెలిసింది.

జిల్లా యువజన అధికారిగా రవికుమార్



పూలమొక్క అందిస్తున్న రవికుమార్

జగిత్యాలటౌన్: జిల్లా యువజన, క్రీడల అధికారి(ఎఫ్ఏసీ)గా ఫిజికల్ డైరెక్టర్ రవికుమార్ నియమితులయ్యారు. స్థానిక ఎస్‌కేఎన్ఆర్ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రవికుమార్‌కు పూర్తి అదనపు బాధ్యతలతో డీవైఎస్‌వోగా నియమిస్తూ బుధవారం కలెక్టర్ ఉత్తర్వులు జారీశారు. దీంతో ఆయన కలెక్టరు యాస్మిన్‌బాషాను మర్యాదపూర్వకంగా కలిశారు. పలువురు అభినందించారు.

సాయం సరిపోయేదెలా?

ఇతడి పేరు చెన్నవేని శంకర్‌బాబు. కథలాపూర్ మండలం సిరికొండ స్వగ్రామం. ఉపాధి కోసం దోహ ఖతర్ వెళ్లాడు. అక్కడ ఉపాధి లభించక తిరిగి వచ్చాడు. ఇందు కోసం చేసిన అప్పు రూ.6లక్షలు అలాగే ఉన్నాయి. ప్రస్తుతం కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు.



ఊరిలో సొంత స్థలం ఉంది. ఇల్లు లేదు. అయితే, గృహలక్ష్మి పథకం ద్వారా ప్రభుత్వం రూ.3 లక్షలు సాయం చేస్తోందని తెలుసుకున్నాడు. కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో రూ.15 లక్షలు వెచ్చిస్తేనే ఇంటి నిర్మాణం పూర్తవుతుందని అంటున్నాడు. ఆ గ్రామంలో ఇల్లు లేనిసుమారు 300 మంది అభిప్రాయం ఇదే..

- సొంతింటి కల నెరవేరుతుందా?
- 'గృహలక్ష్మి'పై పేదల అనుమానాలు
- పెరిగిన నిర్మాణ సామగ్రి ధరలే కారణం



గుంట స్థలంలో ఇంటి నిర్మాణానికి అయ్యే ఖర్చు(సుమారు రూ.లలో)



కథలాపూర్(వేములవాడ): 'ఇల్లు కట్టిచూడు.. పెళ్లి చేసి చూడు' అన్నారు పెద్దలు. ప్రస్తుత పరిస్థితుల్లో పేదలు, మధ్యతరగతి ప్రజలు గుంట స్థలంలో ఇల్లు కట్టుకోవడం అధిక వ్యయంతో కూడుకున్నదిగా మారింది. పేదలకైతే అది కలగానే మారింది. ఇలాంటి వారికోసం రాష్ట్రప్రభుత్వం డబుల్‌బెడ్రూమ్ ఇళ్లు మంజూరు చేస్తూ వారి కలలు సాకారం చేస్తోంది. అయితే, అర్హులు అధికంగా ఉండడం, ఇళ్ల సంఖ్య తక్కువగా ఉండడంతో సొంత జాగా ఉన్నవారికి రూ.3లక్షలను గృహలక్ష్మి పథకం ద్వారా అందిస్తామని ప్రకటించింది. కానీ, ఈ సొమ్ముతో ఇంటి నిర్మాణం పూర్తయ్యే అవకాశాలు లేవని పేదలు అభిప్రాయపడుతున్నారు.

నియోజకవర్గానికి 3వేల ఇళ్లు..

జిల్లాలో జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాలు పూర్తిగా.. వేములవాడ నియోజకవర్గంలో మేడిపెల్లి, కథలాపూర్, బీమారం మండలాలు పాక్షికంగా ఉన్నాయి. చొప్పదండి నియోజకవర్గంలో మల్యాల, కొడిమ్యాల మండలాలు జిల్లా పరిధిలోకి వస్తాయి. గృహలక్ష్మి పథకం ద్వారా నియోజకవర్గానికి 3 వేల ఇళ్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ లెక్కన జిల్లాకు సుమారు 11 వేల ఇళ్లు మంజూరవుతాయని అధికారులు తెలిపారు. వీరిలో ఒక్కొక్కరికి రూ.3లక్షల చొప్పున సాయం అందే వీలుంది.

సాయం పెంచితేనే.. కల నెరవేరేది..

ప్రస్తుతం ఇంటి నిర్మాణ సామగ్రి ధరలు భారీగా పెరిగాయి. ప్రభుత్వం అందించే రూ.3 లక్షలతో ఇంటినిర్మాణం పూర్తికాదని మేస్త్రీలు, బిల్డర్లు చెబుతున్నారు. మరోవైపు.. ఈ సాయంపై ఆశ పెట్టుకుని ఇంటి నిర్మాణం ప్రారంభిస్తే.. పనులు పూర్తిచేయడానికి అప్పులు చేయాల్సి వస్తుందని పేదలు ఆందోళన చెందుతున్నారు. 9ఏళ్ల క్రితం డబుల్ బెడ్రూమ్ ఇళ్లకు ప్రభుత్వం రూ.5.40 లక్షలు కేటాయించిందని, ప్రస్తుతం రూ.3 లక్షలు అందిస్తే ఎలా సరిపోతుందని ప్రశ్నిస్తున్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి కనీసం రూ.18 లక్షలు అందిస్తేనే పేదలకు సొంతింటి కల సాకారమవుతుందని అభిప్రాయపడుతున్నారు.

బీడీలు చుడితేనే పూటగడిచేది



పోయినేడు కురిసిన వానలకు ఇల్లు కుప్పకూలింది. కిరాయి ఇండ్లల్ల ఉంటున్నం. బీడీలు చుడితేనే పూట గడుస్తది. అలాంటిది రూ.15 లక్షలు పెట్టి ఇల్లు కట్టుకునుడు మాతోటి అవుతదా? సర్కారు ఇల్లు కట్టించి ఇయ్యాలె.

– గంగుల రాజుబాయి, కార్మికురాలు, భూషణరావుపేట

ప్రభుత్వమే కట్టించాలి



కూలీ పనులు చేసుకుంటే కుటుంబ పోషణకే సరిపోతంది. కిరాయి ఇంట్లో ఉంటున్నం. డబుల్ బెడ్రూమ్ ఇల్లు కోసం తొమ్మిదేళ్లుగా ఎదురు చూస్తున్నం. ఇప్పటి వరకు దిక్కులేదు. సొంతజాగ ఉంటే రూ.3 లక్షలు ఇస్తమంటున్నరు. ఈ సొమ్ముతు ఇల్లు పూర్తికాదు.

– జిన్న రమ, కూలీ, సిరికొండ, కథలాపూర్

నిర్మాణ రంగం డీలా



ఇంటి నిర్మాణానికి ఉపయోగించే ముడిసరుకుల ధరలు అమాంతంగా పెరిగాయి. దీంతో ఇల్లు కట్టుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపడంలేదు. వ్యాపారం డీలా పడిపోయింది. మా షాపులో సుమారు రూ.8 లక్షల వరకు టర్నోవర్‌కు బ్రేక్ పడింది. – చెక్కపెల్లి రాజుకుమార్, సిమెంట్ వ్యాపారి, కథలాపూర్

అధికార యంత్రాంగం అప్రమత్తం

- అందుబాటులోకి కంట్రోల్ రూమ్ 08727-222557
- కలెక్టర్ యాస్మిన్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: రానున్న రెండురోజుల్లో అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, దీనిద్వారా ప్రాణనష్టం వాటిల్లకుండా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ యాస్మిన్ బాషా ఆదేశించారు. తన కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఈ విషయంపై గ్రామాలు, పట్టణాల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. చెరువులు, కుంటల్లో నీటినిల్వలు పరిశీలించాలన్నారు. నీటి ప్రవాహం పెరిగితే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. రోడ్లు, వంతెనలు, కల్వర్టులపై వరద పరిస్థితిపై సమీక్షించాలని చెప్పారు. అధిక నీటి ప్రవాహం ఉన్నచోట బారికేడ్లు ఏర్పాటు చేయాలని అన్నారు. శిథిలావస్థలోని ఇళ్లను గుర్తించి అందులో నివాసం ఉంటున్నవారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. విద్యుత్ స్తంభాలు, తీగలు, లూజ్‌వైర్లు సవరించాలన్నారు. వ్యవసాయ పనులకు వెళ్లేవారు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. ఎస్పీ భాస్కర్ మాట్లాడుతూ, పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉందన్నారు. లోతట్టు, నీటి పరీవాహక ప్రాంతాల్లో గస్తీ ఏర్పాటు చేశామని చెప్పారు. అత్యవసర సేవల కోసం కంట్రోల్‌రూమ్ నంబరు 08727–222557కు ఫోన్ చేయాలని సూచించారు. ఆర్డీవోలు నర్సింహమూర్తి, రాజేశ్వర్, డీఆర్డీఏ పీడీ లక్ష్మీనారాయణ, డీపీవో దేవరాజ్ పాల్గొన్నారు.

నదీ పరీవాహక ప్రాంత ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

జగిత్యాలక్రైం: ఉత్తర తెలంగాణలోని ఎగువ ప్రాంతాలతోపాటు మహారాష్ట్రలో అతిభారీ వర్షాలు కురుస్తున్నాయని ఎస్సారెస్పీ సీఈ సుధాకర్ బుధవారం తెలిపారు. ప్రాజెక్టులోకి భారీగా వరద వస్తోందని, ఏ క్షణంలోనైనా ఎస్సారెస్పీ గేట్లు ఎత్తి గోదావరి నదిలోకి నీటిని విడుదల చేసే అవకాశం ఉందన్నారు. వరదలతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, నదీ పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. అలాగే గ్రామాల్లో దండోరా వేయించాలని విజ్ఞప్తి చేశారు. నదిలోకి పశువులు, గొర్రెల కాపరులు, మత్స్యకారులు వెళ్లవద్దని ఆయన హెచ్చరించారు.

జిల్లాకు భారీవర్ష సూచన

రానున్న 48 గంటల్లో జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరించింది. దీంతో బుధవారం రాత్రి పోలీసు అధికారులను అప్రమత్తం చేసింది.

గోదావరిలోకి వెళ్లవద్దు..

సారంగాపూర్(జగిత్యాల): ఎస్సారెస్పీ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయనున్న నేపథ్యంలో బీర్‌పూర్ మండలం రంగసాగర్, కమ్మునూర్, మంగేళ, చిత్రవేణిగూడెం, రేకులపల్లి, చిన్న కొల్వాయి తదితర గ్రామాల ప్రజలు, ఇతరులు ఎవరు కూడా గోదావరి నది వైపు వెళ్లవద్దని నీటి పారుదల శాఖ డీఈ చక్రూనాయక్ తెలిపారు.

ఎస్సారెస్పీలో 72.31 టీఎంసీల నీరు

జగిత్యాలరూరల్: జిల్లాకు సాగు, తాగు నీరును అందించే శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 72.310 టీఎంసీలకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1,091.00 అడుగులు కాగా, బుధవారం సాయంత్రం 5 గంటల వరకు 1,086.40 అడుగులకు చేరింది. నీటి నిల్వసామర్థ్యం 90.3 టీఎంసీలకు 72.310 టీఎంసీలకు చేరుకుంది. ప్రస్తుతం 65,257 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. మధ్యాహ్నం వరకు 1.50 లక్షల ఇన్‌ఫ్లో వచ్చింది. సాయంత్రం వరకు తగ్గుముఖం పట్టినా మళ్లీ ఉధృతమైంది.

రోళ్లవాగు వరద కట్టడికి చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ శివారులోని రోళ్లవాగు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న గేట్లు బిగించక పోవడంతో వరద దిగువకు వృథాగా పోతోంది. ఈ విషయంపై 'ఇలా వచ్చి.. అలా వెళ్తోంది' శీర్షికన 'సాక్షి'లో బుధవారం కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు.. దిగువన ఉన్న మూడు తూముల వద్ద వరదను కట్టడి చేసేందుకు బుధవారం చర్యలు చేపట్టారు. రోళ్లవాగు ప్రాజెక్టుకు మూడు తూములు ఏర్పాటు చేశారు. అటవీశాఖ అనుమతులు లేక వాటికి గేట్లు బిగించలేదు. దీంతో కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో ఎగువ నుంచి వస్తున్న వరద తూముల ద్వారా దిగువకు వృథాగా పోతోంది. మంగళవారం రాత్రి బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లి గ్రామంలో ఇళ్లలోకి చేరింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారులు అప్రమత్తమై మూడోతూము వద్ద జేసీబీలతో వరద ప్రవాహం తగ్గించేందుకు కాలువల్లో బండలు వేస్తున్నారు. మంగళవారం వరకు 150 క్యూసెక్కులు బయటకు వెళ్లిపోగా.. ప్రస్తుతం నీటిప్రవాహం 40 క్యూసెక్కులకు తగ్గింది. నీటివృథాను పూర్తిగా అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రోళ్లవాగు ప్రాజెక్ట్ డీఈ చక్రూనాయక్ తెలిపారు.



రోళ్లవాగు వద్ద వరద నీటి కట్టడికి అధికారులు తీసుకుంటున్న చర్యలు

నిర్దేశిత లక్ష్యం చేరుకోవాలి

- సెర్ప్ ప్రాజెక్ట్ అదనపు అధికారి సుధీర్

జగిత్యాలరూరల్: సెర్ప్ లక్ష్యాలను చేరుకోవాలని ఆ ప్రాజెక్ట్ అదనపు అధికారి శ్రీకాంత్ సుధీర్ సూచించారు. జగిత్యాల రూరల్, అర్బన్ మండల సెర్ప్ కార్యాలయాల్లో బుధవారం జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. సెర్ప్ కార్యక్రమాలతోపాటు ఉద్యానవన, ఉపాధిహామీ తదితర శాఖల సమన్వయంతో పండ్లతోటల పెంపకం, డ్రిప్ ఇరిగేషన్‌పై గ్రామాల్లో మహిళలకు అవగాహన కల్పించాలని అన్నారు. అదే సమయంలతో వారిని నుంచి గ్రామపంచాయతీలు దరఖాస్తులు స్వీకరించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి రుణాలు, ఎంటర్‌ప్రైజెస్ ఏర్పాటు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుపై మహిళలకు అవగాహన కల్పించారు. స్త్రీనిధి ఆర్ఎం ఆనందరావు, స్టేట్ సెర్ప్ పీఎం వెంకట్, డీఎంజీ స్వామి, జిల్లా డీఎంజీ దేవయ్య, సీసీలు విద్యాసాగర్, గంగారాం, సంతోష్, రాజేందర్, స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్ రాణి ఉన్నారు.



మాట్లాడుతున్న సుధీర్

పట్టణాభివృద్ధికి అందరూ సహకరించండి

- ప్రజలు, అధికారుల భాగస్వామ్యం అవసరం
- మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్
- పాత బిల్లులపై విచారణ జరపాలి
- 35వ వార్డు కౌన్సిలర్ జయశ్రీ

జగిత్యాల: పట్టణాభివృద్ధే ధ్యేయమని, అందరూ ఇందులో భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణం గతంలో కంటే వంద రెట్లు అభివృద్ధి సాధించిందని తెలిపారు. వర్షాలతో రోడ్లపై ఏర్పడిన గుంతల పూడ్చివేత, సీసీ ప్యాచ్‌వర్క్‌ల కోసం రూ.20 లక్షలు, నూకపల్లి అర్బన్ కాలనీలో 520 డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు 14వ ఆర్థిక సంఘం నుంచి రూ.50 లక్షలు కేటాయించామని వివరించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నా.. ప్రజలు తమ ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పరిశుభ్రత పాటిస్తే డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధుల నియంత్రణ సాధ్యమన్నారు. అనంతరం ఎజెండాలోని 31 అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. కమిషనర్ నరేశ్, డీఈ రాజేశ్వర్, టీపీవో శ్రీనివాస్, టీపీఎస్ తేజస్విని తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోలి శ్రీనివాస్

విచారణ చేపట్టాలి

మున్సిపల్ సాధారణ సమావేశంలో 2020–21 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బిల్లులు, కౌన్సిల్ ఆమోదం లేని పనులను ఎజెండాలో పొందుపర్చి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడానికి చూస్తున్నారని 35వ వార్డు కౌన్సిలర్ జయశ్రీ ఆరోపించారు. ఈమేరకు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. బిల్లుల్లో అవకతవకలు జరిగాయనే కారణంతో అప్పటి మున్సిపల్ కమిషనర్ స్వరూపరాణి వాటిని పక్కన పెట్టారని, వాటినే ఆమోదించేందుకు ప్రస్తుతం ఎజెండాలో చేర్చారని ఆరోపించారు. 31 అంశాలతో కూడిన ఎజెండాలో 1,2 తప్ప మిగితా బిల్లులపై కలెక్టర్‌కు అందిన ఫిర్యాదులో ఉన్నవేనని, కలెక్టర్ స్పందించి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు.

సర్వేల జోరు.. 'సోషల్' హోరు!

- పార్టీలవారీగా నేతలు, అభిమానుల సర్వేలు
- సీఎం, ఎమ్మెల్సీ కవితను పోటీకి నిలిపిన సోషల్ మీడియా
- పొన్నం ప్రభాకర్ పార్టీ మారతారని ప్రచారం
- 'బండి' నిష్క్రమణ, కాంగ్రెస్ కరెంట్ వార్‌తో రీసర్వేలు
- ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ బహిరంగ అభిప్రాయ సేకరణ



సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. ఎమ్మెల్యేలు, ఆశావహుల సర్వేలు జోరందుకున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల లీడర్లు ఎవరికి వారుగా ఓటరు అభిప్రాయ సేకరణ చేస్తున్నారు. ముఖ్యంగా అధికార పార్టీ ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితిపై కార్యకర్తలు, ద్వితీయశ్రేణి నాయకులతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో గత అసెంబ్లీ ఎన్నికల్లో 13 అసెంబ్లీ స్థానాలకు గాను 10 టీఆర్ఎస్ గెలుచుకోగా మిగిలిన మూడింటిలో ఏఐఎఫ్‌బీ, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు గెలిచారు. వీరిలో అధికార పార్టీ ఎమ్మెల్యేలు తమకు అందుబాటులో ఉన్న వివిధ శాఖల అధికారుల ద్వారా ప్రజల మూడ్ తెలుసుకునేందుకు యత్నిస్తున్నారు. మరికొందరు ప్రైవేటు ఏజెన్సీల ద్వారా తెలుసుకుంటున్నారు. పాతజిల్లాలో కొన్ని సోషల్ మీడియా పేజీలు, హండిళ్లు వచ్చే ఎన్నికల్లో ఎవరికి ఓటేస్తారు? అంటూ బహిరంగంగా ఫొటోలు పెట్టి మరీ అభిప్రాయం తెలుసుకోవడం విశేషం.

కరీంనగర్‌లో ఇద్దరు..

కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి పదవి నుంచి తప్పుకున్నాక, ఉచిత విద్యుత్‌పై కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్ చేసిన వ్యాఖ్యల తర్వాత స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కమలాకర్ గంగుల సర్వే చేయించారు. అత్యంత గోప్యంగా నిర్వహించిన ఈ సర్వేతో బీఆర్ఎస్ గ్రాఫ్ 2018 ఎన్నికల కంటే 16 శాతం పెరిగిందని మంత్రి ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు.. ఇప్పటివరకు కాంగ్రెస్ అసెంబ్లీ అభ్యర్థి ఎవరన్నది తేలకపోవడం తమకు అనుకూలిస్తుందని బీఆర్ఎస్ వర్గాలు ధీమాగా ఉన్నాయి.

- మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ బహిరంగ సర్వే ప్రారంభించారు. ప్రతీ గ్రామంలోని 100 మంది ఓటర్లను కలిసే బాధ్యతలను బీఆర్ఎస్ కార్యకర్తకు అప్పగించారు. వీరంతా పార్టీ మండలాధ్యక్షుడికి, మండలాధ్యక్షులంతా ఎమ్మెల్యేతో టచ్‌లో ఉంటారు. ప్రతీ కుటుంబంలో ఎన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయి. ఏదైనా పథకం అందలేదా? ఈసారి ఎన్నికల్లో ఎవరికి ఓటేస్తారు? కులం, వృత్తి, ఫోన్‌నెంబర్లు అడిగి నోట్ చేసుకుంటున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా తాజా ఓటర్లకు సమానమైన పేపర్లు ముద్రించి తీసుకురావడం గమనార్హం. క్షేత్రస్థాయిలో ప్రజల అభిప్రాయాలు, కార్యకర్తల స్థితిగతులను తెలుసుకునేందుకు వివరాల సేకరణ చేపట్టినట్లు ఎమ్మెల్యే రసమయి వెల్లడించారు.

నేతలకు 'సోషల్' బెంగ..

ఉమ్మడి జిల్లాలో సోషల్ మీడియా ప్రచారం ఎమ్మెల్యే అభ్యర్థులను కలవరపరుస్తోంది. ఫలానా స్థానం నుంచి ఫలానా సీనియర్ నేత పోటీ చేస్తారని ఊదరగొడుతున్నారు. ఇంకొందరు నేతల వీరాభిమానులు మీ నియోజకవర్గ ఎమ్మెల్యే ఎవరు? అంటూ ఫ్యాన్ మేడ్ సర్వేల పేరిట ప్రధాన ప్రత్యర్థులు, ఎమ్మెల్యే ఆశావహుల ఫొటోలు పెట్టి ఓటింగ్‌కు వెళ్తున్నారు. ఇది అన్ని పార్టీల అభ్యర్థులకు ఇబ్బందికరంగా మారింది.

- కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ ఏకంగా పార్టీ మారుతున్నారని, ఆయన హుస్నాబాద్ లేదా హుజూరాబాద్ నుంచి పోటీచేస్తారని కొన్నిరోజులుగా సోషల్ మీడియా ప్రచారం హోరెత్తుతోంది. దీనిపై స్పందించిన పొన్నం ప్రభాకర్ తాను పార్టీ మారడం లేదని వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. కొందరు కావాలని తనపై కుట్ర పూరితంగా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. వదంతులను నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు.
- పెద్దపల్లిలో ఉన్నవే మూడు అసెంబ్లీ స్థానాలు. అందులో రామగుండం నుంచి ఎమ్మెల్సీ కవిత, పెద్దపల్లి నుంచి ఏకంగా సీఎం కేసీఆర్ పోటీ చేస్తారని ప్రచారం ప్రారంభించారు. అంతేకాదు వీరిద్దరూ ఆయా స్థానాల నుంచి బరిలోకి ఎందుకు దిగుతారో కూడా కారణాలు వివరిస్తుండటం విశేషం. పార్టీ కార్యక్రమాల్లో సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ కవిత పెద్దపల్లి జిల్లా నేతలతో తీసుకున్న ఫొటోలను వీటికి జతచేస్తున్నారు. తద్వారా ఆయా ఎమ్మెల్యే వర్గాల్లో కలవరపాటుకు కారణమవుతోంది.
- సిరిసిల్లలో నేతల మధ్య ఎలాంటి వార్ లేదు. వేములవాడలో మాత్రం సిట్టింగ్ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్, అదే పార్టీ నుంచి టికెట్ ఆశిస్తున్న చలిమెడ లక్ష్మీనరసింహారావు ఎవరికివారు సర్వేలు చేయించుకుంటున్నారు. ఈ రెండు గ్రూపుల మధ్య సోషల్‌వార్ వాడీవేడిగా నడుస్తోంది.
- జగిత్యాలలో ఎమ్మెల్యేల రహస్య సర్వే కొనసాగుతుండగా.. జిల్లాలో సోషల్ మీడియా వార్ అంతగా కనిపించడంలేదు.

క్లుప్తంగా

తాళం వేసిన ఇంట్లో చోరీ

- రెండున్నర తులాల బంగారం, రూ.4వేల నగదు అపహరణ



ఇంట్లో చిందరవందరగా వస్తువులు

మల్యాల(చొప్పదండి): తాళం వేసిఉన్న ఇంట్లో చోరీ జరిగింది. రెండున్నర తులాల బంగారం, రూ.4వేల నగదు అపహరించారు. ఈ సంఘటన రామన్నపేటలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కోరుట్ల స్రవంతి తన ఇంటికి తాళం వేసి బంధువుల ఇళ్లలో శుభకార్యానికి హాజరయ్యేందుకు వెళ్లింది. బుధవారం ఇంటికి తిరిగి రాగా తాళం పగులగొట్టి కనిపించింది. లోనికి వెళ్లి చూడగా, బీరువా పగులగొట్టి, వస్తువులు చిందరవందరగా పడేసి ఉన్నాయి. బీరువా వెతకగా రెండున్నర తులాల బంగారం , రూ.4,000 నగదు కనిపించలేదు. సమాచారం అందుకున్న సీఐ కోటేశ్వర్, ఎస్సై అశోక్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్ పరిసరాలను తనిఖీ చేశాయి. స్రవంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

కాపర్ వైరు చోరీ

కథలాపూర్(వేములవాడ): మేడిపెల్లి మండలం కల్వకోట, మన్నెగూడెం గ్రామాల శివారులో ఎస్సారెస్పీ వరదకాలువ పక్కనున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసంచేసి అందులోని కాపర్‌వైరును దొంగలు ఎత్తుకెళ్లినట్లు ట్రాన్స్‌కో ఏఈ విశ్వతేజ బుధవారం తెలిపారు. ఆయాగ్రామాల్లో వరదకాలువకు పక్కనున్న మూడు 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను మంగళవారం రాత్రి దొంగలు ధ్వంసం చేసి అందులోని కాపర్‌వైరును చోరీ చేసినట్లు తెలిపారు. రూ.3 లక్షల నష్టం జరిగినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఏఈ విశ్వతేజ పేర్కొన్నారు. ఘటనా స్థలాన్ని ట్రాన్స్‌కో కోరుట్ల రూరల్ ఏడీఈ రఘుపతి, మేడిపెల్లి ఎస్సై చిరంజీవి పరిశీలించారు.

పర్మినెంట్ చేయాలని వినతి

జగిత్యాల: ఆస్పత్రిలో గత 15 సంవత్సరాలుగా పనిచేస్తున్నామని, అలాగే కొనసాగించాలని డీసీహెచ్‌ఎస్ సూపరింటెండెంట్ సుదక్షిణ దేవికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జగిత్యాల ఆస్పత్రిలో గత 15 ఏళ్ల నుంచి పనిచేస్తున్నామని, అలాగే కొనసాగించాలని కోరారు. ఎండీ ముసియొద్దీన్, సందీప్, శ్రీకాంత్, పవన్‌కుమార్, నరేశ్, మల్లైక బేగం, వరలక్ష్మి, సుధాకర్ పాల్గొన్నారు.

శానిటేషన్ విభాగానికి అప్పగింత

జగిత్యాల: పట్టణాన్ని శుభ్రంగా ఉంచడంలో కార్మికులకు చీపుర్లు అవసరం. ఇటీవల టెండర్లకు పిలిచి చీపుర్లకు ఆర్డర్ ఇచ్చారు. కాగా, టెండర్ దక్కించుకున్న వారు నాణ్యత లేని చీపుర్లను కార్యాలయానికి అందజేశారు. లోపల పెద్ద కర్ర ఏర్పాటు చేసి పైన పుల్లలను పెట్టారు. కార్మికులు ఇవి నాణ్యతగా లేవని గుర్తించి తిరిగి శానిటేషన్ విభాగానికి అప్పగించారు. ఈ విషయంపై ఇంజినీరింగ్ అధికారులను వివరణ కోరగా నాణ్యత లేనివి ఇచ్చారని, బిల్లులు చెల్లించలేదని, త్వరలోనే కొత్తవి వస్తాయని పేర్కొన్నారు. తిరిగి వాటిని వాపస్ పంపిస్తామని పేర్కొన్నారు.

క్షీరాభిషేకం

జగిత్యాలటౌన్ : తెలంగాణ రైతాంగానికి చేయూతనిచ్చిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మించి అరవై ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన స్వర్గీయ ప్రధాని నెహ్రూ, నిర్మాణం పూర్తిచేసిన స్వర్గీయ ప్రధాని ఇందిరా ఫ్లెక్సీకి బుధవారం మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తోబుట్టువులే కాలయములు

- అన్నపై పెట్రోల్ పోసి, నిప్పంటించిన వైనం
- ధర్మారం మండలం కొత్తూరులో ఘాతుకం
- ఘటనాస్థలిలోనే బాధితుడి మృతి
- ఇచ్చిన డబ్బులడగడం, వివాహేతర సంబంధానికి అడ్డురావడమే కారణం



వివరాలు సేకరిస్తున్న ఏసీపీ మహేశ్, సీఐ అనిల్, ఎస్సై సత్యనారాయణ

ధర్మారం: డబ్బుపై ఆశ.. వివాహేతర సంబంధం కారణంగా వారికి రక్త బంధం గుర్తు రాలేదు.. తోబుట్టువులే కాలయములై ఇంట్లో నిద్రిస్తున్న తమ అన్నపై పెట్రోల్ పోసి, నిప్పంటించి, కడతేర్చారు.. ఈ విషాద ఘటన పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని కొత్తూరులో చోటుచేసుకుంది. దీంతో గ్రామస్తులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. పోలీసులు, గ్రామస్తుల వివరాల ప్రకారం.. కొత్తూరుకు చెందిన గాలిపెల్లి బక్కయ్య –వినోద దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. కూతురు పుష్పలతను సుల్తానాబాద్ మండలంలోని సుగ్లాంపల్లికి చెందిన బైరి అనిల్‌కు ఇచ్చి, వివాహం చేశారు. పెద్ద కుమారుడు అశోక్(36) ఐదేళ్లు దుబాయిలో ఉండి, పది నెలల క్రితమే స్వగ్రామం వచ్చాడు. అతని తమ్ముడు నరేశ్ జూలపల్లి మండల కేంద్రంలో బైక్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. అశోక్ దుబాయిలో ఉంటూ సంపాదించిన డబ్బులను తన తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాలో జమ చేశాడు. వాటితో నరేశ్ ధర్మారం మండల కేంద్రంలో రెండు గుంటల భూమి కొనుగోలు చేసి, తన పేరిటే రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. తండ్రి బక్కయ్య అనారోగ్యంతో మంచానికే పరిమితం కావడంతో ఇంటి వ్యవహారాలు చూసుకున్నాడు.



అశోక్ (ఫైల్)

తమ్ముడికి వివాహేతర సంబంధం..

ఈ క్రమంలో కొత్తూరుకే చెందిన ఓ వివాహితతో అశోక్ తమ్ముడు నరేశ్ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఆమెను ఇంటికి తీసుకువస్తానని దుబాయి నుంచి వచ్చిన తన అన్నతో చెప్పాడు. దీనికి అతను కుటుంబానికి చెడ్డ పేరు వస్తుందని, తనకు పెళ్లి కావాల్సి ఉందని అభ్యంతరం చెప్పాడు. నరేశ్ ప్రవర్తన నచ్చని అశోక్ తాను పంపించిన డబ్బుల లెక్క చెప్పాలని నిలదీశాడు.

డబ్బులు తిరిగి ఇవ్వాలని చెల్లి, బావపై ఒత్తిడి

అశోక్ తన బావ అనిల్‌కు కూడా అవసరం నిమిత్తం దుబాయి నుంచి డబ్బులు పంపించాడు. వాటిని తిరిగి ఇవ్వాలని చెల్లి పుష్పలత, బావపై ఒత్తిడి చేశాడు. దీంతో ఎలాగైనా అశోక్‌ను చంపాలని నరేశ్, పుష్పలత, అనిల్ నిర్ణయించుకున్నారు. 20 రోజుల క్రితం రాత్రి అతను ఇంట్లో నిద్రిస్తుండగా దాడి చేశారు. ఈ విషయమై అశోక్ ధర్మారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇది కుటుంబ వ్యవహారంగా భావించిన పోలీసులు కులపెద్దల సమక్షంలో పంచాయితీ చేసుకొని, కలిసి ఉండాలని సూచించారు.

స్నేహితుల ఇళ్లలో ఉన్నాడు..

5 రోజుల క్రితం కులపెద్దలు అశోక్, నరేశ్‌లను పిలిపించి తల్లిదండ్రులు బతికున్నంత కాలం ఆస్తుల జోలికి వెళ్లవద్దని, చెరో రూ.లక్ష వారి వద్ద నుంచి తీసుకోవాలని సూచించారు. దీనికి అన్నదమ్ములిద్దరూ అంగీకరించారు. అయితే తనకు ప్రాణహాని ఉందని అనుమానించిన అశోక్ ఇంటికి రాకుండా గ్రామంలోని స్నేహితుల ఇళ్లలో ఉన్నాడు. దీంతో బయట ఎందుకు ఉంటున్నావని ఇంటికి వెళ్లి, కలిసి ఉండాలని కుల పెద్దలు సూచించారు. దీంతో మంగళవారం రాత్రి ఇంటికి వచ్చి నిద్రించాడు. బుధవారం తెల్లవారుజామున నరేశ్, పుష్పలత, అనిల్ అతను బయటకు రాకుండా తలుపు గడియపెట్టారు.

కిటికీలో నుంచి నిప్పంటించారు..

నిద్రలో ఉన్న అశోక్‌పై కిటికీలో నుంచి పెట్రోల్ పోసి, నిప్పంటించారు. మంటలకు అశోక్ లేచి, బయటకు వచ్చే ప్రయత్నం చేసినప్పటికీ సాధ్యం కాలేదు. దీంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి వరుసకు అన్న అయిన కొక్కుల రాంనారాయణ ఫిర్యాదు మేరకు ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. సంఘటన స్థలాన్ని పెద్దపల్లి ఏసీపీ మహేశ్, సీఐ అనిల్, ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ పరిశీలించి, వివరాలు సేకరించారు. నరేశ్, పుష్పలత, అనిల్‌పై స్థానికులు దాడి చేసేందుకు ప్రయత్నించగా అడ్డుకొని, పోలీస్ వాహనంలో ధర్మారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఉపాధ్యాయులే జాతి నిర్మాతలు



మాట్లాడుతున్న డీఈవో జగన్మోహన్‌రెడ్డి

జగిత్యాల: ఉపాధ్యాయులే జాతి నిర్మాతలని డీఈవో జగన్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం సూర్య పాఠశాలలో తొలిమెట్టుపై ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అందించిన పాఠ్య పుస్తకాల ప్రణాళికలను అభ్యాస దీపికలను ఉపాధ్యాయులు సక్రమంగా ఉపయోగించుకుని విద్యార్థులు కనీస అభ్యాసనా సామర్థ్యాలు సాధించేలా కృషి చేయాలన్నారు. ప్రణాళికబద్ధంగా బోధిస్తే ఆశించిన ఫలితాలు సులభంగా సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి కొక్కుల రాజేశ్, సమన్వయ కర్త తిరుకోవెల నరేందర్, రిసోర్స్ పర్సన్ అభయ్‌రాజ్, మహేశ్, విజయ్, జయంత్ పాల్గొన్నారు.

‘ప్రజల ఇబ్బందులు పట్టవా?’



వంతెనను పరిశీలిస్తున్న ఉమ, నాయకులు

కథలాపూర్(వేములవాడ): గ్రామాల్లోని ప్రజలు సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే పాలకులు పట్టించుకోవడం లేదని బీజేపీ నాయకురాలు తుల ఉమ మండిపడ్డారు. సిరికొండ– తక్కళ్లపెల్లి మధ్య వాగుపై అసంపూర్తిగా మిగిలిన వంతెన పనులను బుధవారం ఆమె పరిశీలించారు. 2016లో వంతెన పనులు ప్రారంభిస్తే ఇప్పటికీ పూర్తికాలేదన్నారు. ఇందుకు ప్రజాప్రతినిధుల వైఫల్యమే కారణమని ఆరోపించారు. వంతెన లేక తక్కళ్లపెల్లి నుంచి కథలాపూర్ మధ్య రాకపోకలు సాగించే విద్యార్థులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి స్పందించి పనులను త్వరగా పూర్తి చేయించాలని డిమాండ్ చేశారు. నాయకులు అల్లాడి రమేశ్, శ్రీరాముల ప్రకాశ్, మొలిగె శ్రీనివాస్, జిల్లా సత్యం, ఎండీ ఎక్బాల్, అల్లకొండ విజయ్, దాసరి జలేందర్, జగన్‌రెడ్డి, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వలస కూలీ మృతి

సారంగాపూర్: మండలంలోని పోతారం గ్రామ శివారులోని ఓ డెయిరీ ఫాంలో బిహార్‌కు చెందిన పింటూ యాదవ్ (27) అనే కూలీ విద్యుత్‌షాక్‌తో మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం బిహార్‌లోని ముజాఫర్పూర్‌కు చెందిన పింటూ యాదవ్ గ్రామంలోని గోకుల్ డెయిరీ ఫామ్‌లో ఆరేళ్లుగా పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం 4 గంటల ప్రాంతంలో ఫ్యాన్ స్విచ్ వేసే క్రమంలో విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. మృతుడికి అన్న వరస అయిన టున్ టున్ రాయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నాడు.

గుండెపోటుతో యువకుడు..



మహేశ్ (ఫైల్)

మల్లాపూర్ : మండంలోని రాఘవపేట గ్రామానికి చెందిన ఓ యువకుడు గుండెపోటుతో మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మాధం గంగమల్లయ్య–లింబవ్వ దంపతులకు కుమార్తె, కుమారుడు మహేశ్ (36)ఉన్నారు. మహేశ్‌కు 15 ఏళ్ల క్రితం కోరుట్ల మండలం పైడిమడుగు గ్రామానికి చెందిన భవానితో వివాహమైంది. మంగళవారం రాత్రి మహేశ్‌కు గుండెపోటుతో రావడంతో కుటుంబ సభ్యులు మెట్‌పల్లిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు మహేశ్ మృతిపట్ల సంతాపం తెలిపారు. బాధిత కుటుంబానికి మనోధైర్యం కల్పించాలని ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి అంతిమయాత్రలో పాల్గొన్నారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు రుత్విక, రక్షిత ఉన్నారు.

ఆర్యవైశ్యుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందజేస్తున ఆర్యవైశ్యులు

సారంగాపూర్: ప్రభుత్వం ఆర్యవైశ్యుల కోసం కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని బీర్‌పూర్ మండల ఆర్యవైశ్యులు బుధవారం తహసీల్దార్ శ్రీలతకు వినతిపత్రం అందజేశారు. ఆర్యవైశ్యుల్లో అత్యంత పేదలు ఉన్నారని, వీరికి ప్రభుత్వం రూ. లక్షసాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో మండల ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు పాత రమేశ్, నాయకులు కాసం ఈశ్వరయ్య, అక్కినపల్లి రాజయ్య, అక్కినపల్లి వేణుగోపాల్, రేగొండ రమేశ్, గుండ వంశీ, గుండ శేఖర్, సిరుప శేఖర్, దేవకి రమణ, సిద్ధు, చెన్న గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లుల్లో తనిఖీ

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం కల్లెడ గ్రామ శివారులోని ఆంజనేయ రైస్‌మిల్లులో పౌరసరఫరాల శాఖ అధికారులు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వానికి అప్పగించాల్సిన బియ్యం త్వరితగతిన అప్పగించాలని మిల్లర్లకు సూచించారు. ఇక్కడ డీటీ సీఎస్‌లు వరప్రసాద్, ఆనంద్, మహేశ్వర్‌రావు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే



జగిత్యాల: ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ బుధవారం సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను హైదరాబాద్‌లో కలిశారు. నియోజకవర్గానికి మరిన్ని నిధులు కేటాయించేలా చూడాలని, అలాగే నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: జిల్లాలోని స్థానిక ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రిన్సిపాల్స్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికకు కనీసం 10 సంవత్సరాల బోధనా అనుభవం, 15 సంవత్సరాల బోధన అనుభవం గల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్ దరఖాస్తులకు అర్హులన్నారు. అర్హులైన వారు సంబంధిత మండల విద్యాధికారుల ద్వారా దరఖాస్తులను ఈనెల 31లోపు విద్యాధికారి కార్యాలయంలో అందించాలన్నారు.

జగిత్యాలరూరల్: పండ్లతోటల పెంపకం కోసం ఉపాధిహామీ ద్వారా 2023–24 సంవత్సరానికి ఆసక్తిగల రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో సంతోష్‌కుమార్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు, ఐదెకరాలలోపు ఉన్నవారు, ఉపాధి జాబ్‌కార్డు కలిగిన వారు, బోరుబావి కలిగిన వారు, విద్యుత్ కనెక్షన్ ఉన్నవారు ఇందుకు అర్హులని, అర్హులు ఈనెల 31వ తేదీవరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పోలీసుల దాడులు

ధర్మపురి : మండలంలోని తుమ్మెనాల శివారులో జూదం ఆడుతుండగా పోలీసులు దాడిచేసి చేసి రూ.22,400 నగదుతో ఎనిమిది ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తుమ్మెనాల శివారులో మంగళవారం కొందరు జూదం ఆడుతున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడి నగదు, ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం కూడా వారి వివరాలు తెలుపకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. బడా నాయకులు ఉన్నట్లు అందుకే వాహనాలు స్వాధీనం చేసుకున్నారే తప్ప ఏ ఒక్కరి పేరు బయటకు పొక్కకుండా పోలీసులు రహస్యంగా ఉంచారనే ఆరోపణలున్నాయి. ఎస్సై రామకృష్ణను వివరణ కోరగా సమాధానమివ్వలేదు.

సైబర్ వల

- క్రిప్టో కరెన్సీ ఇన్‌స్ట్రక్ట్ పేరుతో మోసం
- పోలీసులకు యువకుడి ఫిర్యాదు

జగిత్యాలక్రైం: సైబర్ నేరగాళ్ల చేతిలో మరో యువకుడు మోసపోయాడు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లా కేంద్రంలోని అరవింద్‌నగర్ ప్రాంతానికి చెందిన పడకంటి శ్రీకాంత్‌కు గుర్తు తెలియని నెంబర్ నుంచి ఫోన్‌చేసి క్రిప్టో కరెన్సీ ఇన్‌స్ట్రక్ట్‌లో డబ్బులు సంపాదించవచ్చని తెలిపారు. దీనిని నమ్మిన శ్రీకాంత్ వారు పంపిన లింక్‌ను ఓపెన్ చేశాడు. మొదట కొంత డబ్బు పంపగా దానికి రెండింతల డబ్బును జమచేశారు. దీనిని నమ్మి బలికిన శ్రీకాంత్ పలు దఫాల్లో రూ.5,02,800 జమచేశాడు. కొన్ని రోజులు గడిచినా డబ్బులు జమకాలేదు. ఫోన్‌చేయగా స్పందనలేకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి బుధవారం రాత్రి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

‘సబ్బితం’లో మునిగి యువకుడి మృతి



మృతదేహాన్ని తీసుకువస్తున్న పోలీసులు



జలపాతంలో స్నేహితులతో వెంకటేశ్ (ఎడమ నుంచి మొదటి వ్యక్తి)

- ఈత కొట్టేందుకు జలపాతంలో దిగడంతో ఘటన
- కళ్లముందే జరగడంతో కన్నీరుమున్నీరైన స్నేహితులు
- మృతుడు కరీంనగర్ వాసి



వెంకటేశ్ (ఫైల్)

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని సబ్బితం పంచాయతీ పరిధి గౌరీగుండాల జలపాతం అందాలను చూసేందుకు స్నేహితులతో వెళ్లిన ఓ యువకుడు నీటిలో మునిగి మృతిచెందాడు. కళ్లముందే మునిగిపోయాడని అతని మిత్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. కరీంనగర్ పట్టణంలోని కిసాన్‌నగర్‌కు చెందిన మానుపాటి వెంకటేశ్(24) ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. బుధవారం తన స్నేహితులు అభిలాష్, రాకేశ్, భరత్, అఖిల్‌తో కలిసి గౌరీగుండాల జలపాతం వద్దకు వెళ్లాడు. అక్కడ అందరూ కలిసి ఫొటోలు దిగారు. తర్వాత ఈత కొట్టేందుకు నీటిలో దిగారు. కొద్దిసేపటికే నీటి ఉధృతికి వెంకటేశ్ మునిగిపోయాడు. అతని స్నేహితులు కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకున్నారు. వెంకటేశ్ కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఏసీపీ ఎడ్ల మహేశ్, సీఐలు అనిల్‌కుమార్, సత్యనారాయణ, ఎస్సై మహేందర్, అగ్నిమాపక అధికారి శ్రీనివాస్ తమ సిబ్బందితో జలపాతం వద్దకు వచ్చారు. రెండు గంటలపాటు శ్రమించి, వెంకటేశ్ మృతదేహాన్ని వెలికితీశారు. తన కుమారుడు డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి, బయల్దేరాడని, ఇలా జలపాతంలో శవమయ్యాడంటూ మృతుడి తండ్రి రాజేశం రోదించారు. ఈ ఘటనతో పోలీసులు పొక్లెయిన్ తెప్పించి, జలపాతం వైపు వెళ్లకుండా కందకం తవ్వించారు.

ఆరేళ్లలో 15 మంది..

గౌరీగుండాల జలపాతంలో మునిగి, ఆరేళ్లలో 15 మంది చనిపోయారు. ఐదేళ్ల క్రితం ఫారెస్ట్ అధికారులు తాత్కాలికంగా రక్షణ కోసమంటూ పైభాగంలో రెయిలింగ్ ఏర్పాటు చేసినా కొద్దిరోజులకే తొలగించారు. జలపాతం వద్దకు వచ్చే పర్యాటకులు నీటిలోకి దిగకుండా దూరం నుంచే చూసేలా చుట్టూ ఇనుపకంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

భూ వివాదంలో వ్యక్తి దారుణ హత్య



చిన్న మల్లయ్య (ఫైల్)



చిన్నమల్లయ్య మృతదేహం

మల్యాల(చొప్పదండి): భూ వివాదంలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. మల్యాల సీఐ కోటేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని మద్దుట్లకు చెందిన బర్ల చిన్న మల్లయ్య, అన్న బర్ల ఎర్రయ్య మధ్య కొంతకాలంగా భూ వివాదం నెలకొంది. గ్రామ శివారులోని గుట్టల నుంచి వచ్చే వరదనీటిని పైపులు వేసి మళ్లించాలనే క్రమంలో బుధవారం మరోసారి ఇద్దరు అన్నదమ్ముల మధ్య గొడవ జరిగింది. దీంతో బర్ల ఎర్రయ్య కుమారుడు గంగారెడ్డితో కలిసి చిన్నమల్లయ్య (50)పై గొడ్డలితో దాడిచేశారు. దీంతో చిన్న మల్లయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా సీఐ కోటేశ్వర్, ఎస్సైలు అశోక్, కుమారస్వామి సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. బర్ల ఎర్రయ్య గంగారెడ్డి పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం. మృతుడి భార్య చిన్న మల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

సత్యనారాయణకు కన్నీటి వీడ్కోలు



భౌతిక కాయం వద్ద నివాళి అర్పిస్తున్న జీవన్‌రెడ్డి

ధర్మపురి : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వకీల్ సాబ్ (సీనియర్ న్యాయవాది) సత్యనారాయణకు బుధవారం వందలాది మంది కన్నీటి వీడ్కోలు పలికారు. ధర్మపురికి చెందిన తిరుమందాస్ సత్యనారాయణ 15 ఏళ్లనుంచి జగిత్యాలలో సీనియర్ అడ్వకేట్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం కరీంనగర్ నుంచి ధర్మపురికి తిరిగి వెళ్తుండగా బొలేరో వాహనం ఆయన కారును ఢీకొట్టింది. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. బుధవారం ధర్మపురిలో అశ్రునివాళుల మధ్య సత్యనారాయణ అంత్యక్రియలు జరిపారు. కుల బాంధవులు, న్యాయవాదులు, స్నేహితులు, అభిమానులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

నివాళులర్పించిన జీవన్‌రెడ్డి

సత్యనారాయణ భౌతికకాయం వద్ద ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. చిన్న తనంలోనే తండ్రిని కోల్పోయిన కొడుకు శ్రీరామ్ తండ్రికి తలకొరివి పెట్టడడం అందరిని కలిచివేసింది. కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య శోభ కుమారుడు శ్రీరామ్ (14) కూతురు మేధ (9) ఉన్నారు.

పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలి

జగిత్యాలటౌన్ : పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల పాత పింఛన్ సాధన సంకల్పయాత్ర బుధవారం సాయంత్రం జగిత్యాలకు చేరింది. రాష్ట్ర కంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని దేవి శ్రీ గార్డెన్స్‌లో నిర్వహించిన పాత పెన్షన్ సంకల్ప రథయాత్ర కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకు ముందు పట్టణంలోని పద్మనాయక కల్యాణ మండపం నుంచి ఉద్యోగులు బైక్ ర్యాలీ నిర్వహించారు. జగిత్యాల తహసీల్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సీపీఎస్ వద్దు పాత పింఛన్ ముద్దు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా స్థితప్రజ్ఞ మాట్లాడుతూ సీపీఎస్‌తో ఉద్యోగులకు భద్రత కరువైందని, పాత పింఛన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం నాయకులు రమేశ్, కొక్కుల రాంచంద్రం, దేవయ్య, ఆనందరావు, బన్నా, ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధితుల సమస్యలు పరిష్కరించాలి

- ఎస్పీ భాస్కర్



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ

సారంగాపూర్(జగిత్యాల): పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యల తక్షణమే పరిష్కరించాలని ఎస్పీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. బుధవారం మండల పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..పోలీస్‌స్టేషన్‌పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. బ్లూకోల్ట్స్ పెట్రో కార్ నిరంతరం గస్తీ నిర్వహించాలన్నారు. తరుచూ గ్రామాలను సందర్శించి సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించి ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు. పోలీస్‌స్టేషన్‌లో పచ్చదనాన్ని పెంపొందించేందుకే నర్సరీని ఏర్పాటు చేసేందుకు అనువైన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం నర్సరీకి కావాల్సిన ఏర్పాట్లు చేయాల్సిందిగా ఎస్సైకి సూచించారు. అనంతరం బీర్‌పూర్ పోలీస్‌స్టేషన్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. ఇక్కడ రూరల్ ఎస్సై ఆరీఫ్ అలీఖాన్ పాల్గొన్నారు.

రైతులకు మద్దతు ధర కల్పిస్తాం

కథలాపూర్(వేములవాడ): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు మద్దతు ధర కల్పిస్తామని ఆ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ భరోసా ఇచ్చారు. బొమ్మెన గ్రామంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ధాన్యం క్వింటాలకు రూ.2,500 మద్దతు ధర చెల్లిస్తామని, ఏకకాలంలో రూ.2లక్షల పంటరుణం మాఫీచేస్తామని హామీ ఇచ్చారు. ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షల చొప్పున సాయం చేస్తామని తెలిపారు. కౌలు రైతులకు ఎకరాకురూ.15 వేలు, ఉపాధిహామీ కూలీలకు రూ.12 వేల సాయంగా అందిస్తామని చెప్పారు. నాయకులు కాయితి నాగరాజు, అల్లూరి దేవారెడ్డి, సత్యనారాయణ, హరిప్రసాద్, కల్లెడ గంగాధర్, రిక్కల తిరుపతిరెడ్డి, లింగంగౌడ్, జీవన్ రెడ్డి, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు అవగాహన కల్పించాలి

కథలాపూర్(వేములవాడ): గ్రామాల్లో దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులకు ఆరోగ్యంపై వైద్యసిబ్బంది అవగాహన కల్పించాలని వైద్యశాఖ జిల్లా ప్రోగ్రామింగ్ అధికారి ఎండీ సమియొద్దీన్ పేర్కొన్నారు. బుధవారం బీమారం మండలకేంద్రంలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను ఆయన తనిఖీ చేశారు. వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యసిబ్బంది మేడిపెల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ హాస్టళ్లలో దోమల నివారణ మందు స్ప్రే చేయించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రవీణ్‌చంద్ర, వైద్యసిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.